సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా: మర్రి

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జడ్పీ మైదానంలో సోమవారం నిర్వహించిన మహిళా యువగర్జన సభకు మహిళలు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గంలో ఎంజీకేఎల్ఐని పూర్తి చేయించి లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నామని వివరించారు. తాను మంచి చేస్తుంటే కొందరు కావాలని తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. బతికున్నంత వరకు తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదింటి ఆడబిడ్డలకు ఉచితంగా పెండ్లీలు చేస్తానని హామీ ఇచ్చారు.

–నాగర్‌కర్నూల్, నవంబర్ 27(నమస్తే తెలంగాణ)

మొరాయించిన అమిత్‌షా ప్రచార రథం

పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి దుగ్యాల ప్రదీప్‌కుమార్‌కు మద్దతుగా పెద్దపల్లిలో సోమవారం నకల జనుల విజయ సంకల్ప (రోడ్ షో)ను నిర్వహించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పాల్గొన్న ఈ రోడ్ షోకు.. 10 వేల మంది ప్రజలు వస్తారని ఏర్పాట్లు చేయగా.. కేవలం 3 వేల మంది మాత్రమే వచ్చారు. దీంతో కమలనాథులు తీవ్ర నిరాశలో ఉన్నారు. దీనికి తోడు పెద్దపల్లి కమాన్ వద్ద అమిత్‌షా ఎక్కిన ప్రచార రథం మొరాయించింది. బీజేపీ నాయకులు, కార్యకర్తలు దానిని నెట్టినా స్టార్ట్ కాలేదు. మరో వాహనంలో అమిత్‌షా జెండా చౌరస్తాకు చేరుకున్నారు. ఇలా బీజేపీ శ్రేణులు తలపెట్టిన రోడ్ షో అట్టర్ ఫ్లాప్ కావడంతో అనుకున్నదొక్కటి.. అయినది ఒక్కటి అని అసంతృప్తికి గురయ్యారు.

–పెద్దపల్లి, నవంబర్ 27(నమస్తే తెలంగాణ)

గులాబీ ఘర్.. షాద్‌నగర్: సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో నిర్వహించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు

సంగారెడ్డి సై.. అందోల్ జై!

చేవెళ్ల జోరు.. షాద్‌నగర్ హుషారు!

- ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలు సక్సెస్
- అన్ని సభలకూ అంచనాకు మించి భారీ జనం
- జననేత, సీఎం కేసీఆర్ ప్రసంగానికి విశేష స్పందన
- రైతుబంధు, ధరణి, కరెంటు ఉండాలంటూ నినాదం
- నృత్యాలు, కేరింతలతో అంతటా జనంలో జోష్

సంగారెడ్డి/అందోల్/రంగారెడ్డి/షాద్‌నగర్, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి సై అంది.. అందోల్ జైకొట్టింది.. చేవెళ్లలో జోరు.. షాద్‌నగర్‌లో జనం హుషారు పెద్ద ఎత్తున ఆవిష్కృతమైంది. సోమవారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలకు అంచనాకు మించిన జనం తరలివచ్చారు. దీంతో సీఎం బహిరంగ సభాప్రాంగణాలు జనజాతరను తలపించాయి. నాలుగుచోట్ల ప్రజా ఆశీర్వాద సభలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. అన్ని చోట్ల రైతుబంధు, ధరణి, 24 గంటల విద్యుత్తు ఉండాలా? వద్దా? అన్ని కేసీఆర్ ప్రశ్నకు అన్ని సభల్లో ఉండాల్సిందేనంటూ ప్రజలు ఉవ్వెత్తున నినదించారు. సంగారెడ్డిలోని తార డ్రిగీ కళాశాల గ్రౌండ్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాలు, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల నుంచి వేలాది జనం తరలివచ్చారు. సభాస్థలి జనంతో నిండిపోవడంతో రోడ్డుపై నిలబడిన జనం కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన వాహనాలతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వేలాది మంది సభాస్థలికి చేరుకోలేకపోయారు. సభకు హాజరైన జనం నృత్యాలు చేస్తూ, కేరింతలు కొడుతూ సందడి చేశారు. బహిరంగ సభకు వచ్చిన జనం స్పందనను చూసి ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ భావోద్వేగానికి గురై వేదికపైనే కంటతడిపెట్టారు. మంత్రి హరీశ్‌రావు ఆయనను సముదాయించారు. అందోలు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ అధ్యక్షతన జరిగిన సభకు జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. డప్పుచప్పుళ్లు, బ్యాండ్ మేళాలతో సభకు వివిధ గ్రామాల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చారు. అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ కొద్దిసేపు డ్యాన్స్‌చేసి కార్యకర్తల్లో జోష్ నింపారు. సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు చప్పట్లు కొడుతూ, కేరింతలు కొడుతూ సందడి చేశారు. తాను ఈ ప్రాంత బిడ్డనే, ఈ ప్రాంతమీద మమకారం ఉంటది, ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డనే కదా.. అంటూ పైరెండు చోట్ల సాగిన ప్రసంగం జిల్లావాసులను కట్టిపడేసింది.

గుండెల నిండా అభిమానం.. చేతుల్లో గులాబీ జెండా

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో, షాద్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు కాలె యాదయ్య, అంజయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలకు జనహోరు పోటెత్తింది. గుండెల నిండా అభిమానంతో గులాబీ జెండాలు చేతబూని.. మెడలో గులాబీ కండువాలు ధరించి తరలివచ్చిన సబ్బండ వర్ణాల ప్రజానీకంతో రెండు పట్టణాలు జనసంద్రాలయ్యాయి. జనంతో సభా ప్రాంగణాలు కిక్కిరిసిపోగా, బయట రోడ్లమీదనే ఉండి ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ఆలకించారు. ముస్లింలను ఉద్దేశించి రెండు సభల్లోనూ సీఎం కేసీఆర్ హిందీలో ప్రసంగించడంతో ఆ వర్గాల్లో సంతోషం వ్యక్తమైంది. బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. చప్పట్లు, ఈలలతో జనామోదాన్ని తెలిపారు. పాలమూరు ఎత్తిపోతలతో త్వరలోనే కృష్ణా నీటిని పారిస్తామని కేసీఆర్ చెప్పడంతో విశేష స్పందన కనిపించింది. చేవెళ్ల నియోజకవర్గం మొత్తానికి ఒకే విడతలో దళితబంధు మంజూరు చేస్తామన్న కేసీఆర్ ప్రకటనతో కరతాళ ధ్వనులు మార్మోగాయి. రెండు ఆశీర్వాద సభల్లోనూ నాటి కాంగ్రెస్ పాలనను సీఎం కేసీఆర్ కడిగి పారేశారు.

రైతుబంధు కావాలా? కాంగ్రెస్ కావాలా?

- హస్తం పార్టీ ఫిర్యాదుతో రైతుబంధు నిలిపివేసిన ఈసీ
- కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఇవ్వరు.. ఇచ్చినవాళ్లను అడ్డుకుంటున్నారు
- వాళ్లేంచేసినా డిసెంబర్ 3 వరకే..
- కర్ణాటక పరిస్థితి ఇక్కడ రావొద్దు
- రైతులతో కేసీఆర్‌ది పేగు బంధం
- లింగాయత్‌లు, మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి
- ఝరాసంగం, జహీరాబాద్ సమావేశాల్లో మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలో జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో కారు గుర్తుకే ఓటేయాలని ఈవీఎంను చూపిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, నవంబర్ 27: రైతుబంధు పంపిణీని నిలిపివేసిన కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్ నేతల ఫిర్యాదుతో ఎన్నికల సంఘం రైతుబంధు పంపిణీని నిరాకరించారని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగం, జహీరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రైతుబంధు కావాలంటే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఖతం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. తెలంగాణ పొలిమేర నుంచి ఆ పార్టీని తరలికొట్టాలని అన్నారు. రైతుల నోటికాడి బుక్కను అడ్డుకుంటారా? అని కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఖాతాల్లో డబ్బు వేసేందుకు ప్రభుత్వం సిద్ధం కాగా, ఆ పార్టీ నేత నిరంజన్ ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్ రైతుబంధును నిలిపివేసిందని వెల్లడించారు. రైతుబంధు కావాలా? కాంగ్రెస్ ఖతం కావాలా? అన్నది రైతులు ఆలోచించి ఎన్నికల్లో ఓటు వేయాలని సూచించారు. 'రిస్క్ వద్దు.. కారుకే ఓటు గుద్దు' అని పిలుపునిచ్చారు.

డిసెంబర్ 3 వరకే ఆపగలరు!

డిసెంబర్ 3 వరకే రైతుబంధును కాంగ్రెస్ నేతలు ఆపగలరని, ఆ తర్వాత మళ్లీ ఇచ్చేది సీఎం కేసీఆరేనని హరీశ్ అన్నారు. 11 సార్లు రైతుబంధును రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేశామని, మూడోసారి అధికారంలోకి వచ్చాక ఎకరానికి రూ.16 వేలు ఇస్తామని వివరించారు. రైతులతో సీఎం కేసీఆర్‌ది ఓటు బంధం కాదని, పేగుబంధం అని స్పష్టం చేశారు. 5 గ్యారెంటీలు అని చెప్పి కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని అటకెక్కించిందని ఆరోపించారు. అక్కడి ప్రభుత్వం దివాలా తీసిందని తెలిపారు. వారిని నమ్మి ఓటేస్తే తెలంగాణకు కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు.

లింగాయత్‌ల అభివృద్ధికి ఎన్నో పథకాలు

లింగాయత్ సమాజ్ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వరుడి విగ్రహం ఏర్పాటు చేశామని, లింగాయత్ భవనం నిర్మాణానికి స్థలం ఇచ్చి నిధులు మంజూరు చేశామని వివరించారు. జహీరాబాద్‌లో లింగాయత్ భవనాల నిర్మాణానికి, హుగ్గెల్లి చౌరస్తాల్లో బసవేశ్వర్ విగ్రహం ఏర్పాటుకు నిధులు మంజూరు చేశామని వెల్లడించారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కూడా సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. మాజీ మంత్రి ఫరీదుద్దీన్ కుమారుడు తన్వీర్‌కు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి ఇచ్చామని అన్నారు. జహీరాబాద్‌లో షాదీఖానా, హజ్‌హౌస్‌కు నిధులు మంజూరు చేశామని, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని వివరించారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మాణిక్‌రావును అధిక మోజార్టీతో గెలిపించాలని కోరారు.

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కేసీఆర్ పాలన చేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారని వెల్లడించారు. సమావేశాల్లో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఎన్నికల ఇన్‌చార్జి దేవిప్రసాద్‌రావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, టీఎస్‌డీసీ చైర్మన్ తన్వీర్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్‌పాటిల్, రైల్వే బోర్డు సభ్యులు షేక్ ఫరీద్, టెలికం బోర్డు సభ్యులు పవార్ శంకర్‌నాయక్, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, బీఆర్ఎస్ నాయకులు జీ గుండప్ప, సుభాశ్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, గోటిగార్‌పల్లి భూమయ్య, జనార్దన్, శంకర్ పాటిల్, నామ రవికిరణ్‌తో పాటు వివిధ మండల పార్టీ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వైపే గౌడ కులస్థులు

- తెలంగాణ వచ్చాకే గౌడల అభ్యున్నతి
- మళ్లీ గెలిస్తే సేఫ్టీ మోకులు, మోపెడ్‌లు
- గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్

రామంతాపూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ తదితరులు

రామంతాపూర్, నవంబర్ 27: రాష్ట్రంలోని 32 లక్షల మంది గౌడ కులస్థులు బీఆర్ఎస్ వైపే ఉన్నారని, కారు గుర్తుకే ఓటేస్తారని గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ స్పష్టం చేశారు. హైదరాబాద్ పాత రామంతాపూర్‌లో సోమవారం గౌడసంఘం నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వం గౌడల అభ్యున్నతికి విశేషంగా పాటుపడుతున్నదని తెలిపారు. గౌడ వృత్తిదారులందరికీ బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందని చెప్పారు. ప్రతి ఏటా కల్లు గీత వృత్తిదారులు చెల్లించే 20 కోట్ల రెంటల్స్ మాఫీ చేసిందని, సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని, నాడు కాంగ్రెస్ సర్కారు కల్లు దుకాణాలను మూసి వేస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 103 కల్లు సొసైటీలను తెరిపించిందని, 30 అడుగుల పాపన్న భారీ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని వివరించారు. హైదరాబాద్ నడిబొడ్డున నీరా కేఫ్‌ను ఏర్పాటు చేశారని, కల్లుగీత కార్మికులకు బీమా తీసుకొచ్చారని, గౌడ కులస్థుల ఆత్మగౌరవం కోసం కోకాపేటలో భవనం నిర్మాణానికి 5 ఎకరాల స్థలం ఇచ్చారని, వైన్ షాపుల్లో గౌడలకు 15 శాతం రిజర్వేషన్ కల్పించారని చెపపారు. కల్లు గీత కార్మికుల మరణాలను అరికట్టేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం బీహార్ నుంచి పొట్టి తాటి మొక్కలను తెప్పించిందని, కార్మికుల సేఫ్టీ కోసం మోకులు, మోపెడ్స్‌ను ఇప్పించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. తమ అభ్యున్నతికి ఇన్ని చేసిన బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని రాష్ట్రంలోని గౌడ కులస్థులకు పిలుపునిచ్చారు. ఉప్పల్‌లో ఉన్న గౌడ సోదరులు బీఆర్ఎస్ అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గౌడ సంఘం ప్రతినిధులు పాలకూర దాసుగౌడ్, గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలకూర శ్రీకాంత్‌గౌడ్, నేమూరి శ్రీకాంత్‌గౌడ్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే కల్లుపై నిషేధం

- కర్ణాటకలో తాజాగా కల్లుపై నిషేధం
- ఇక్కడా గీత వృత్తిని నిర్వీర్యం చేస్తారు
- గౌడల అభ్యున్నతికి కేసీఆర్ విశేష కృషి
- గౌడ కులస్థులు బీఆర్ఎస్‌నే గెలిపించుకోవాలి
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

ఖైరతాబాద్, నవంబర్ 27: కాంగ్రెస్ పార్టీ పొరపాటున అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కల్లును నిషేధిస్తుందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటకలో గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఇటీవలే అక్కడ కల్లును నిషేధించిందని, రాష్ట్రంలో అధికారంలోకి వస్తే అదే మాడల్ తీసుకువస్తామని ఆ పార్టీ నేతలు చెప్తున్నారని పేర్కొన్నారు. గతంలో మన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక మంది గీత కార్మికులను పొట్టనపెట్టుకున్నదని, కల్లు రవాణా చేయకుండా 767 జీవోను తీసుకొచ్చి 50 కిలోమీటర్ల పరిధి విధించి వేలాది మంది గీత కార్మికులకు అన్యాయం చేసిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కల్లును నిషేధించి 46 మంది ఆత్మహత్యలకు కారణమైందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓట్లడిగే హక్కులేదని, మళ్లీ ఆ పార్టీ వస్తే రాష్ట్రంలో గీత వృత్తి నిర్వీర్యమైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ తన హయాంలో కల్లు గీత కార్మికులు, గౌడ కులస్థుల కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. ఈ సారి కూడా గౌడలందరూ బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హ్యాట్రిక్ సీఎంగా విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జై గౌడ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టి కూటి రామారావుగౌడ్, జీ రవీందర్‌గౌడ్, మధుసూదన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటరమణగౌడ్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోమవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ముస్లిం మైనార్టీల సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ముస్లిం సోదరులు

బీఆర్ఎస్‌తోనే నాయీబ్రాహ్మణులు

నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ

హైదరాబాద్, నవంబర్27 (నమస్తే తెలంగాణ): నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి అన్నివిధాలుగా అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ వెంటే నాయీబ్రాహ్మణ సమాజం ఉండాలని నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదని కొనియాడారు. సెలూన్లకు 250 యూనిట్ల కరెంటును ఉచితంగా ఇస్తున్నదని, సెలూన్ల ఆధునికీకరణ, ఏర్పాటు కోసం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నదని పేర్కొన్నారు. కులవృత్తిపై ఆధునిక శిక్షణను ఇప్పిస్తున్నదని తెలిపారు. నాయీబ్రాహ్మణ సమాజానికి హైదరాబాద్‌లో ఆత్మగౌరవభవాన్ని నిర్మిస్తున్నదని పేర్కొన్నారు. నాయీబ్రాహ్మణులంతా బీఆర్ఎస్ పార్టీకే ఓటేయాలని కోరారు.

కేసీఆర్‌కే బీసీల మద్దతు

తెలంగాణ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్

హైదరాబాద్, నవంబర్27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకే తెలంగాణ బీసీల సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మునుపెన్నడూ లేనివిధంగా బీసీ విద్యార్థుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం డిగ్రీ వరకు గురుకులాలను ఏర్పాటు చేసిందని, విదేశీ విద్యానిధిని అందిస్తున్నదని పేర్కొన్నారు. కులవృత్తులకు ప్రోత్సహిస్తున్నదని, ముడిసరుకు, యంత్ర పరికరాల కొనుగోలు కోసం 100 శాతం సబ్సిడీతో రూ.లక్షను అందిస్తున్నదని తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఆత్మగౌరవ భవనాలను నిర్మించి ఇస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ బీఆర్ఎస్‌తోనే బీసీ వర్గాలకు లబ్ధి చేకూరుతుందని, మరే పార్టీతోనూ సాధ్యం కాదని తెలిపారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అయ్యేందుకు బీసీలంతా బీఆర్ఎస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు.